RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 281 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 09-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 281 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 09-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-



### అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...

# విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం

- జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు
- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
- బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
- సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష




**అమరావతి,సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా

తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

క్రూజ్ నౌక ఎంవీ హిండియస్‌లో హంటా వైరస్ వ్యాప్తి కలవరపాటుకు గురిచేస్తోంది. ముఖ్యంగా నౌకా సిబ్బందిలో ఇద్దరు భారతీయులు ఉండటం మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఈ పరిణామాలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ డైరెక్టర్ నవీన్ కుమార్ స్పందించారు. ఈ వైరస్ కేసులు అక్కడక్కడ కనిపిస్తున్నాయని, వైరస్‌తో భారత్‌కు తక్షణ ముప్పు ఏమీ లేదన్నారు. ప్రస్తుతానికి సామూహిక వ్యాప్తికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవన్నారు. "ఈ వైరస్ మానవుల నుంచి మానవులకు సంక్రమించడం చాలా అరుదు. ఆసియా, ఐరోపా దేశాల్లో వెలుగు చూసే ఈ వైరస్ మానవుల మధ్య సోకదు. ఆండెస్ వైరస్ వంటి కొన్ని దక్షిణ అమెరికా జాతుల్లో మాత్రమే ఇలా వ్యాప్తిచెందినట్లు రికార్డులున్నాయి" అని ఎన్ఐవీ డైరెక్టర్ వెల్లడించారు.

**హంటా తెచ్చిన తంటా!-ఆ ప్రాంతాలకు వెళ్లొద్దు..:** ఇది కొవిడ్, ఇన్ఫ్లుయెంజా వైరస్ కాదని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. తొలుత ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయని, వైరస్ సోకిన ఒకటి నుంచి ఐదు వారాల్లో లక్షణాలు బయటపడతాయన్నారు. దేశంలో ఇటువంటి అనుమానిత వైరస్ కేసులను గుర్తించడానికి అవసరమైన ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. నౌకలు, గిడ్డంగులు, స్టోరేజీ కేంద్రాలు, గాలి ప్రసరణ సరిగాలేని ప్రదేశాల్లో పనిచేసే వ్యక్తులు పరిశుభ్రత పాటించాలని, ఎలుకలు ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని ఎన్ఐవీ డైరెక్టర్ సూచించారు.

**మరిన్ని కేసులు..:** ఇది తీవ్ర పరిణామమే అయినప్పటికీ.. దీని వల్ల ప్రజారోగ్య ముప్పు తక్కువగానే ఉన్నట్లు అంచనా

తరువాయి 2లో..

# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

- ఏపీ ఈసెట్ 2026 ఫలితాలు విడుదల
- మొత్తం 91.72 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత
- ఫలితాలను 'ఎక్స్' వేదికగా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్‌లోనూ ర్యాంకు కార్డుల వెల్లడి
- బీటెక్ సెకండియర్‌లోకి లేటరల్ ఎంట్రీ కోసం ఈ పరీక్ష

తరువాయి 2లో..







## బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి..

# రేపే ప్రమాణస్వీకారం

- పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోల్‌కతాలో అధికారికంగా ప్రకటించారు
- భవానీపూర్‌లో మమతా బెనర్జీపై గెలిచిన సువేందుకే సీఎం పీఠం
- రేపు కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణస్వీకారం
- ప్రధాని మోదీ హాజరుకానున్నట్లు సమాచారం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభమైంది. రాష్ట్ర బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి ఎన్నికయ్యారు. కోల్‌కతాలో శుక్రవారం

తరువాయి 2లో..

## ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

గుడ్‌బై చెప్పింది. ఇక కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసినట్లు వెల్లడించింది. తమకు లోక్‌సభలో ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి తాజాగా లేఖ రాశారు. కాంగ్రెస్ ఎంపీల పక్కన కూర్చోలేమని అందులో పేర్కొన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేకు కాంగ్రెస్ మద్దతు తెలపడంతో డీఎంకే ఈ నిర్ణయం తీసుకుంది.

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# వ్యూహకర్తలా... ఊహాగానాలా ?

ఎన్నికలు ఇపుడు కార్పొరేట్ స్టైల్ ని సంతరించుకున్నాయి. దాంతో పాటుగానే రాజకీయ వ్యూహకర్తలు అని ఒక కొత్త వ్యవస్థ రంగంలోకి దిగింది. దేశంలో గడచిన రెండు దశాబ్దాలుగా ఇది నెమ్మదిగా మొదలై ఈ రోజున ఒక అతి ముఖ్యమైన వ్యవస్థగా మారిపోయింది. నిజానికి వ్యూహకర్తలు చేసేది ఏమిటి అని ఆలోచిస్తే అది బ్రహ్మ పదార్థం లాంటిదే. వారికి రాజకీయ పార్టీల పెద్దలు రెడ్ కార్పెట్ పరుస్తున్నారు. తమ పార్టీ సభలలోకి ఆహ్వానించి ముఖ్య అతిధిలుగా చేసి ఉచితాసనం ఇస్తున్నారు. వారి కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. వారికి విలాసవంతమైన జీవితాన్ని ఇస్తూ వారు ఇచ్చే సలహా సూచనలతో పార్టీలను నడుపుతున్నారు. మిడతంభొట్లు జోస్యం మాదిరిగా ఆయా పార్టీలు గెలిస్తే అంతా వారి క్రెడిట్ ఖాతాలోకి పోతోంది. ఓడితే మాత్రం వారికి పోయేది ఏమీ లేదు పార్టీల నెత్తిన తెల్ల గుడ్డ పడుతోంది. ఆ పార్టీలను నమ్ముకున్న నాయకులు, లక్షలాది మంది క్యాడర్ అంతా కూడా దిక్కు తెన్నూ లేకుండా పోతున్నారు. రాజకీయ పార్టీలు తమ వారిని నమ్మడం మానేస్తున్నాయి. తమ పార్టీకి పట్టు కొమ్మలుగా వెన్ను దన్నుగా జీవగర్ర గా ఉన్న కార్యకర్తలతో దూరం పాటిస్తున్నాయి. సొంత పార్టీలో నాయకులకు అధినాయకత్వానికి మధ్య అతి పెద్ద అగాధం ఏర్పడుతోంది. అధినేతను కలవాలంటే అపాయింట్మెంట్ తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదే సమయంలో ఈ వ్యూహకర్తలకు మాత్రం డోర్స్ ఎపుడూ తెరచే ఉంటున్నాయి. వారు ఇచ్చే సలహాలే పార్టీలను విజయ తీరాలకు చేరుస్తాయన్న గుడ్డి నమ్మకంతో నాయకులు తాము ఉన్న గదుల నుంచి బయటకు రాకుండా కీలకమైన నిర్ణయాలనే కాదు అభ్యర్థుల ఎంపిక నుంచి అన్నీ చేసుకుంటూ పోతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే సంప్రదాయ రాజకీయానికి భిన్నంగా సాగుతున్న ఈ పోకడ ఒక బ్యాడ్ కల్చర్ గా మారింది అని అంటున్నారు. ఏ రాజకీయ పార్టీకి అయిన అసలైన బలం బలగం క్యాడర్ మాత్రమే అని అంటున్నారు. వారికి నేరుగా ప్రజలతో మంచి సంబంధాలు ఉంటాయి. వారు నిత్యం జనంతో మమేకం అవుతారు, వారికి కష్టాలు తెలుసు నష్టాలు తెలుసు ఏ నిర్ణయం వెనక జనాలు ఏమనుకుంటున్నారో తెలుసు. అందుకే వారిని దగ్గరకు తీసి సమావేశాలు అపుడపుడైనా పెడితే అసలు వాస్తవాలు వారే చెబుతారు. గ్రౌండ్ లెవెల్ రియాలిటీస్ వారి నుంచే వస్తాయి. తమ పార్టీ తప్పులు ఎదుటి పార్టీ తప్పులు అలాగే తమ బలాలు ప్రత్యర్థి బలాలు అన్నీ కార్యకర్తలే చెబుతారు. వారికి తెలిసిన దానిలో పదవ వంతు కూడా వ్యూహకర్తలకు తెలియదు, వారి ద్వారా అపాయింట్ అయిన బృందాలకూ తెలియదు అంటున్నారు. దేశంలో వరసగా వ్యూహకర్తల పథకాలు అట్టర్ ఫ్లాప్ అవుతున్నాయి. తాజా ఎన్నికల్లో కూడా రెండు రాష్ట్రాల్లో వ్యూహకర్తలను నమ్మిన బడా నాయకులు ఇపుడు ఫలితం చేదుగా రావడంతో కుమిలిపోతున్నారు. ఈ విషయం తెలిసి మరో పెద్ద రాష్ట్రానికి వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతున్న చోట ఒక కీలక పార్టీ తాము నియమించుకున్న సదరు సంస్థను వ్యూహకర్తలను తప్పించి భారీ షాక్ ఇచ్చేసిన ఉదంతం తెలుస్తోంది. ఇపుడిపుడే రాజకీయ పార్టీల నాయకులలో కూడా అంతర్మధనం కనిపిస్తోంది. వ్యూహకర్తల వల్ల అయ్యేది ఏమీ లేదని కూడా అర్థం అవుతోంది. అద్దం లో తాము ఎలా ఉంటే అలాగే కనిపిస్తుంది తప్ప కొత్త అందం రాదూ అని కూడా అర్థం అవుతోంది. అభిమానంతో పనిచేసే క్యాడర్ ని అలాగే పార్టీ మీద నమ్మకంతో పనిసే నాయకులను వదులుకుని ఎండమావుల లాంటి వ్యూహకర్తల వ్యవస్థ వెంట పడి చేతి ఫలితాలను తెచ్చుకోవడం వారికి వందల కోట్లు ఖర్చు చేయడం అవసరమా అన్న చర్చ కూడా చాలా పార్టీలలో జరుగుతోంది. ఏ పార్టీకైనా వేవ్ ఉంటే ప్రజలలో సానుకూలత ఉంటే కచ్చితంగా గెలుస్తుంది. ఆ పార్టీ క్యాడర్ ఓట్లను జనం ద్వారా పోలింగ్ బూత్ ల దాకా తీసుకెళ్ళి వేయిస్తారు. అంటే నెట్ వర్క్ పార్టీది అయితే నిర్ణయం జనాలది. అలా ప్రజలలో తమ పార్టీ పట్ల అనుకూలత పెంచుకోవాలి, క్యాడర్ ని దగ్గరకు తీసి పార్టీని పటిష్టం చేసుకోవాలి. ఈ రెండు విషయాలని అత్యంత ముఖ్యమైన వాటిని పక్కన పెట్టి పొలిటికల్ కన్సల్టెంట్లు చేతిలో సక్సెస్ ఉందని భావించి అన్నీ వారితోనే అన్నట్లుగా అధినాయకులు చేస్తే నేల విడిచి సాము అవుతుంది అని అంటున్నారు. ఎక్కడైనా వేవ్ లేకపోతే గెలిపించిన ఒక్క ఎన్నికల వ్యూహకర్తను చూపించమని కూడా అంతా అంటున్నారు. సో రాజకీయ పార్టీలు ఊహాగానాలకు వ్యూహకర్తలకు ఎపుడైతే స్వస్తి చెబుతారో అపుడే వారికి విజయం దక్కుతుందని అంటున్నారు.

### అంతర్జాతీయ విద్యాభ్యాసానికి పావలా వడ్డీకే రుణాలు...

# విద్యార్థులకు అండగా చంద్రబాబు ప్రభుత్వం

చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

**సంక్షేమ పథకాలపై సమీక్ష, కీలక ఆదేశాలు**

సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

**బుడగజంగాలకు ఎస్సీ ప్రయోజనాలు**

సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.

**పేదల సొంతింటి కల సాకారం**


రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.

**పరిపాలనలో పారదర్శకత, వేగం**

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

# పీలేరు నియోజకవర్గ ఆలయాల అభివృద్ధికి రూ. 6.78 కోట్లు మంజూరు

### ఎమ్మెల్యే కిషోర్ కుమార్రెడ్డి కృషి.



**మదనపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 8 సిటిజన్ టైమ్స్**


పీలేరు నియోజకవర్గంలోని ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు సర్వ శ్రేయోనిధుల నుంచి రూ. 6,78,50,000/- నిధులు మంజూరయ్యాయని దీనికి పీలేరు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కృషి ఎక్కువగా ఉన్నదని నగిరిపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ దేవాదాయ శాఖ ఈవో మంజుల ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు -పీలేరు మండలం దొడ్డిపల్లి శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయం నకు రూ. 63,50,000/- అన్నంగి వారి పల్లె శ్రీ మాతమ్మ ఆలయంనకు - రూ. 75,00,000/-, వాయల్పాడు మండలం చింతపర్తిగుంటి వీర గంగమ్మ ఆలయం నకు రూ. 1,00,00,000/-, శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం - రూ. 1,00,00,000/- గుర్రంకొండ మండలం చెర్లోపల్లి రెడ్డమ్మ దేవత ఆలయం నకు రూ. 2,20,00,000/- కలికిరి మండలం గుండ్లూరు శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంనకు రూ. 1,20,00,000/-మంజూరు చేయడం జరిగిందని "నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సర్వ శ్రేయోనిధుల నుంచి భారీగా నిధులు మంజూరు చేయించారని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఆలయాలు ఇప్పుడు నూతన శోభ సంతరించుకోనున్నాయి. ఇది భక్తులకు శుభవార్త. ఎమ్మెల్యే గారి కృషి వల్లే ఇది సాధ్యమైంది" అని కొనియాడారు.ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్పందిస్తూ "మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలిచే ఆలయాల అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తాం. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి సరికొత్త రికార్డు

### - గంటల్లో ఫైళ్ల పరిష్కారం.. మంత్రి అచ్చెన్న పనితీరుకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

### - పారదర్శకత, వేగం, సమర్థత.. మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకత

**అమరావతి,:( సిటిజన్ టైమ్స్): మే 8**



ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అసాధారణ వేగం ప్రదర్శిస్తూ పరిపాలనలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రభుత్వ యంత్రాంగంలో చురుకుదనాన్ని పెంచుతున్నాయి. గతంలో ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌కు సుమారు 5 గంటల సమయం తీసుకున్న మంత్రి అచ్చెన్నాయుడు, ప్రస్తుతం భారీ స్థాయిలో ఫైళ్లు వచ్చినప్పటికీ సరాసరి కేవలం 2 గంటల 49 నిమిషాల వ్యవధిలోనే ఫైళ్లను డిస్పోజ్ చేస్తుండటం పరిపాలనా సామర్థ్యానికి నిదర్శనమని అధికారులు వెల్లడించారు. ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌ను రోజుల వ్యవధి నుంచి గంటల వ్యవధిలోకి తీసుకురావడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలనలో వేగం, పారదర్శకత, ప్రజా ప్రయోజనాల పట్ల కట్టుబాటుతో ముందుకు సాగుతున్న మంత్రి అచ్చెన్నాయుడి పనితీరును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ, అనుబంధ శాఖల పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతోందని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఆయన కార్యాచరణ స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# పోక్సో కేసులకు ప్రత్యేక కోర్టులు




పిల్లలపై లైంగిక నేరాల నిరోధానికి తీసుకొచ్చిన పోక్సో పోక్సో చట్టం-2012 ప్రకారం దేశవ్యాప్తంగా ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కోర్టుల ప్రధాన ఉద్దేశ్యం చిన్నారులకు త్వరితగతిన న్యాయం అందించడం, అలాగే వారికి భయరహిత వాతావరణంలో విచారణ నిర్వహించడం. చట్టంలోని సెక్షన్-28 ప్రకారం ప్రతి జిల్లాలో ఒక సెషన్స్ కోర్టును పోక్సో ప్రత్యేక కోర్టుగా రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపులతో గుర్తిస్తుంది. ఆగస్టు 2025 నాటికి దేశంలో 400 ప్రత్యేక పోక్సో కోర్టులతో కలిపి మొత్తం 773 ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయి. పోక్సో చట్టం ప్రకారం చిన్నారి సాక్ష్యాన్ని కోర్టు నేరాన్ని పరిగణనలోకి తీసుకున్న 30 రోజుల్లోపు నమోదు చేయాలి. సాధ్యమైనంత వరకు కేసు విచారణను ఏడాది లోపే పూర్తి చేసి తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రత్యేక కోర్టులకు నేరాలను నేరుగా విచారణకు స్వీకరించే అధికారం ఉంది. బాధిత చిన్నారుల గోప్యతకు చట్టం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చింది. విచారణను 'ఇన్-కెమెరా' విధానంలో నిర్వహించడంతో పాటు బాధితుల పేరు, పాఠశాల తదితర వివరాలు బయటకు రాకుండా కోర్టులు జాగ్రత్తలు తీసుకుంటాయి. చిన్నారులు నిందితులను నేరుగా చూడకుండా తెరలు లేదా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణ నిర్వహించే అవకాశం కల్పించబడింది. అదేవిధంగా నిందితుడికి శిక్ష విధించడమే కాకుండా, బాధితుడికి కలిగిన శారీరక, మానసిక నష్టానికి పరిహారం చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించవచ్చు. నేర తీవ్రతను బట్టి కనీసం 10 ఏళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు లేదా మరణశిక్ష వరకు విధించే అధికారం ఈ కోర్టులకు ఉంది. ఇటీవల పోక్సో కేసుల పెండెన్సీపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, మూడు వందలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్న ప్రతి జిల్లాలో అదనపు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని సూచించింది. జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పి.బి. వరాలే ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. పిల్లల రక్షణకు పోక్సో ప్రత్యేక కోర్టులు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మొదటి పేజీ తరువాయి

# హంటావైరస్.. భారత్‌కు తక్షణ ముప్పు లేదు

వేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ ఘెబ్రెయేసస్ పేర్కొన్నారు. అయితే, వైరస్ పొదిగే కాలాన్ని దృష్టిలో ఉంచుకొని.. మరిన్ని కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి మరియా వాన్ మాట్లాడుతూ.. ఈ వైరస్ భిన్నంగా వ్యాప్తి చెందుతోందని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

# ఏపీ ఈసెట్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం ఈ ఫలితాలను 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ పరీక్షలో మొత్తం 91.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 32,434 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 29,750 మంది అర్హత సాధించారు. ఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులందరికీ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా బీటెక్, బీఈ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు (లేటరల్ ఎంట్రీ) ఈసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. దీని ద్వారా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని ఆదా చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈసెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ జరుగుతుంది. ఫలితాలు, ర్యాంకు కార్డులను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ఎచీం.ఖజూంఎష్ట్రవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీంతో పాటు, విద్యార్థులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ఈసారి వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది. తమ ఫోన్‌లోని వాట్సాప్ నుంచి 9552300009 నంబర్‌కు సందేశం పంపి కూడా ర్యాంకు కార్డును సులభంగా పొందవచ్చు. ఫలితాల విడుదల ప్రక్రియ పూర్తవడంతో, త్వరలోనే అడ్మిషన్ల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి విడుదల చేయనుంది. విద్యార్థులు తదుపరి ప్రకటనల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు అధికారి.. రేపే ప్రమాణస్వీకారం

జరిగిన బీజేపీ నూతన ఎమ్మెల్యేల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర పరిశీలకుడిగా హాజరైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా... బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారి పేరును అధికారికంగా ప్రకటించారు. ఈ క్రమంలో బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించి, 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు తెరదించిన విషయం తెలిసిందే. మొత్తం 294 స్థానాలకు గాను 207 సీట్లు గెలుచుకొని బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ నేపథ్యంలో శాసనసభాపక్ష నేత ఎన్నిక కోసం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహ పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్‌తో పాటు భవానీపూర్ స్థానం నుంచి కూడా గెలుపొందారు. ముఖ్యంగా భవానీపూర్‌లో తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీపై 15 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం ఆయనకు కలిసొచ్చింది. మే 9న కోల్‌కతాలోని ప్రసిద్ధ బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం ఉంది. సువేందు అధికారి ఎన్నికతో రాష్ట్రంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకుంటున్నారు.

# ఇండీ కూటమికి డీఎంకే గుడ్‌బై

తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించడంపై డీఎంకే ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నుంచి ఆ పార్టీ వైదొలగడాన్ని ఖండించారు. కూటమికి కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని.. పాత రాజకీయ స్వభావాన్ని ఆ పార్టీ మార్చుకోలేదని ఆక్షేపించారు. కూటమి వల్లే కాంగ్రెస్‌కు రాజ్యసభ ఎంపీ, అసెంబ్లీ సీట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ద్రోహాన్ని అధిగమించి బలమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం వ్యతిరేకించారు. స్వలాభాల కోసం కూటమి నేతలను వదులుకోవడం సరైన చర్య కాదన్నారు.

# డోర్ టు డోర్ చెత్త సేకరణ పైన కమీషనర్ సమీక్ష

### జి.వి.పి. రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలి.

### క్లాప్ వాహనాల నిర్వహణ ఏజెన్సీలు, సూపర్వైజర్లకు సూచనలు జారీ చేసిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే 8**

గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జి.వి.పి) రహిత నగరంగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు క్లాప్ వాహనాల నిర్వహణ ఏజెన్సీ, సూపర్వైజర్లు కృషి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, క్లాప్ వాహనాల నిర్వహణ ఏజెన్సీ ప్రతినిధులు, సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ క్లాప్ వాహనాలు డోర్ టు డోర్ చెత్త సేకరణలో సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నందున నివాసితులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేస్తున్నారని క్లాప్ వాహనాల నిర్వహణ ఏజెన్సీల ప్రతినిధులు, సూపర్వైజర్ల పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా క్లాప్ వాహనాల సూపర్వైజర్ల విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు .జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్వైజర్లు శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయం శానిటరీ కార్యదర్శిలు, పారిశుధ్య కార్మికులు నిత్యం విధులు నిర్వహిస్తున్నప్పటికీ కూడా క్లాప్ వాహనాల వ్యర్థాల సేకరణలో లోపాలు కనిపించడంవలన కాలనీలు, వీధులు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా క్లాప్ వాహనాలపై సూపర్వైజర్ల పర్యవేక్షణా లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని, ఇకపై ప్రణాళికాయుతంగా చెత్త సేకరణలో లోపాలను సవరించాలని, లేనియెడల క్లాప్ వాహన ఏజెన్సీ, సూపర్వైజర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ క్లాప్ వాహనాలు సేకరించకపోవడం వలనే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు అధికమవుతున్నాయని తెలిపారు. ఇకపై క్లాప్ వాహనాలు ఉదయం 5:30 నిమిషాలకు వాహనానికి కావలసిన ఇంధనంతో పాటు పూర్తి కండిషన్ తో చెత్త సేకరణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ జరిపేటప్పుడు ప్రజలకు క్లాప్ వాహనం వచ్చింది అని తెలిసేందుకు జింగిల్స్ ప్లే చేస్తూ విజిల్ తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. ప్రతి క్లాప్ వాహనం విధిగా మూడు ట్రిప్పులు వేయాలని, ముందుగా డోర్ టు డోర్ చెత్త సేకరణ చేసిన తరువాత మాత్రమే ఎక్కడైనా బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు ఉంటే వాటిని కూడా సేకరించాలని ఆదేశించారు. క్లాప్ వాహనాల సూపర్వైజర్లు లోడర్ల విధివిధానాలను కూడా గమనిస్తూ వారి విధులలోని లోపాలు వుంటే అధికారులకు వెంటనే తెలియపరచాలన్నారు. ఇంటింటి నుండి నిత్యం పిన్ పాయింట్ వారీగా చెత్త సేకరణ జరిగేలా వాహనాల సూపర్వైజర్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి వారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించడం జరుగుతుందని, సమస్యలు సూచనలు తద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. నిత్య పారిశుద్ధ్య నిర్వహణలో వాహనాల విధివిధానాల్లో లోపాలు లేకుండా సానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శుల సమన్వయంతో సంయుక్త కార్యాచరణ వాహనాల సూపర్వైజర్లు జరపాలని కమిషనర్ సూచించారు.


## అనకాపల్లిలో మే 19న రవాణా శాఖ వాహనాల బహిరంగ వేలం



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :08**

వివిధ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి జి. మనోహర్ తెలిపారు. గడువు ముగిసినా పన్నులు, అపరాధ రుసుములు చెల్లించకుండా వాహనాలను వదిలివేసిన యజమానులు స్పందించకపోవడంతో వేలానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వేలానికి ముందు వరకు సంబంధిత యజమానులు లేదా ఫైనాన్సియర్లు బకాయి పన్నులు, జరిమానాలు చెల్లించి వాహనాలను తీసుకెళ్లవచ్చని తెలిపారు. లేనిపక్షంలో తదుపరి ఎటువంటి నోటీసు లేకుండానే వాహనాలను వేలం వేయనున్నట్లు స్పష్టం చేశారు. స్వాధీనం చేసిన వాహనాలను అనకాపల్లి రవాణా శాఖ కార్యాలయం, సబ్బవరం, కె.కోటపాడు, ఎలమంచిలి పోలీస్ స్టేషన్లు, అనకాపల్లి బస్ డిపో మరియు లంకలపాలెం పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ యార్డ్‌లో ఉంచినట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.10,000 ధరావత్తు చెల్లించి, వేలానికి ముందురోజు సాయంత్రం 5 గంటలలోపు జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఆధార్ ప్రతులను సమర్పించాలని సూచించారు. వేలం ముగిసిన వెంటనే పూర్తి మొత్తాన్ని చెల్లించి, ఐదు రోజులలో వాహనాలను తీసుకెళ్లాలని, లేనిపక్షంలో చెల్లించిన మొత్తం ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు అనకాపల్లి రవాణా శాఖ కార్యాలయంలో కార్యాలయ వేళల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

## పీలా శ్రీనివాసరావును పరామర్శించిన సీఎం రమేష్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 08**

ఇటీవల కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న మాజీ విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావుని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ శుక్రవారం పెందుర్తిలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎంపీ ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ , బిజెపి స్టేట్ మీడియా ప్యానలిస్ట్ ఈర్ల శ్రీరామ్మూర్తి బిజెపి సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావుతదితరులు పాల్గొన్నారు.

## మోదకొండమ్మ ఉత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, మే :08**

గిరిజనుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న పాడేరు మోదకొండమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఉత్సవ కమిటీ చైర్మన్, పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ మేరకు వారు సీఎంను కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అమ్మవారి ఉత్సవాలు గిరిజన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా ఎంతో వైభవంగా నిర్వహించబడతాయని వారు సీఎంకు వివరించారు. ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరగా, కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని చంద్రబాబు నాయుడు తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రాహత్' వరం : ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :08**

అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీఎం-రాహత్' పథకం ఎంతో ఉపయోగకరమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి 60 నిమిషాలు 'గోల్డెన్ అవర్'గా అత్యంత కీలకమని, ఈ సమయంలో బాధితులకు తక్షణ వైద్యం అందితే ప్రాణాపాయం నుంచి రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 100 లేదా 112 నంబర్లకు సమాచారం ఇవ్వడంతో పాటు, 108 అంబులెన్స్ ద్వారా బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పీఎం-రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత ఉచిత చికిత్స పొందవచ్చని తెలిపారు. ప్రమాదం జరిగిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చికిత్స అందించబడుతుందని, ఈ సదుపాయం పొందేందుకు బాధితుడిని 24 గంటలలోపు ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుందని వెల్లడించారు. పాదచారులు, వాహనదారులు, విదేశీయులు సహా రోడ్డు ప్రమాదానికి గురైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రమాదాల్లో మరణాల రేటును తగ్గించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అలాగే ప్రమాద బాధితులను సమయానికి ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే 'గుడ్ సమారిటన్' లేదా 'రహ-వీర్'లకు ప్రభుత్వం రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. సహాయం చేసిన వారిని పోలీసుల నుంచి ఎటువంటి వేధింపులు ఉండవని, సాక్ష్యం చెప్పాలని బలవంతం చేయబోమని హామీ ఇచ్చారు. ప్రమాద సమాచారం అందిన 24 గంటల్లోపు పోలీసులు ధృవీకరణ పూర్తి చేసి సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తారని పేర్కొన్నారు. "మానవత్వంతో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడండి. రోడ్డు ప్రమాదం కనిపిస్తే భయపడకుండా ముందుకు వచ్చి సహాయం చేయండి" అని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జీవీఎంసీ తూర్పు జోన్‌లో మే 14న బహిరంగ వేలం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే 08**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ తూర్పు జోన్ పరిధిలో ఖాళీగా వున్న షాపు రూములు, కళ్యాణ మండపములకు, 3 సంవత్సర ముల కాలమునకు గుత్తలకు ఇచ్చుటకు గాను తేది: 14-05-2026 న ఉదయం 11 గంటలకు తూర్పు జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని, ఆసక్తి గల పాటదారులు పూర్తి వివరాలకు జోనల్ కమిషనర్ కార్యాలయం లోని పని వేళలో కార్యలయ పర్యవేక్షకులను సంప్రదించగలరని, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

## జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 13 వినతులు

### – జీవీఎంసీ ఛీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే-- 08:**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 13 వినతులు స్వీకరించడమైనదని జీవీఎంసీ ఛీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల పాత సమావేశం మందిరంలో సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి, డీసీపీలు, ఏసీపీ లతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీ లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించ్టందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 13 వినతులు స్వీకరించడం జరిగినదని, అందులో ముఖ్యంగా మధురవాడ జోన్ కు 05, ఈస్ట్ జోన్ కు 01, సౌత్ జోన్ కు 03, గాజువాక జోన్ కు 03, పెందుర్తి జోన్ కు 01 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఒక వినతి పత్రాన్ని ఒక దివ్యాంగుని వద్దకు వెళ్ళి స్వయంగా స్వీకరించడమైనదని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

### జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 08:**

జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమన్వయ సమీక్ష సమావేశంలో జిల్లాలో మే 21 నుండి జూన్ 2 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా, ఎటువంటి లోపాలకు తావులేకుండా నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సరాల పబ్లిక్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం మొత్తం 60 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, లైటింగ్, టాయిలెట్లు, డెస్కులు, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రతి కేంద్రంలో అత్యవసర మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ప్రశ్నపత్రాలు మరియు జవాబు పత్రాల రవాణా ప్రక్రియను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్ పి. మురళీధర్, జిల్లా వొకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి పి. ఉమారాణి, జివిఎంసి, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, ఏపీఎస్ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆదాయ వంతంగా కొండ పొలం

## - ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం - జల వనరులను కాపాడుకుందాం

## - అడవి వ్యవసాయం తో తరతరాలకూ ఆదాయం - జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ





**దేవరపల్లి, సిటిజన్ టైమ్స్, మే 08:**
ఆదాయ వంతంగా కొండ పొలం వ్యవసాయం చేయడం ఆనందంగా ఉంది అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం అన్నారు. శుక్రవారం ఉదయం అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తామరాబు గ్రామం లో సనపల జగదీష్ , విష్ణు ప్రియ దంపతులకు చెందిన "సమతుల్య" అడవి వ్యవసాయాన్ని సందర్శించడం జరిగింది అన్నారు. అక్కడ ప్రకృతి ఆధారంగా కొండల్లో నుండి వస్తున్న జల వనరులను భూగర్భం లోనికి ఇంకే విధంగా చేస్తూ, అడవిని ఏ మాత్రం తొలగించకుండా పంటలు పండించడం ఇక్కడ విశేషంగా ప్రతి ఒక్కరినీ ఆకర్షించే, స్పందింపచేసే అంశం అన్నారు. వర్షం నీటిని భూగర్భం లోనికి వెళ్ళె విధంగా వాలుకు అడ్డంగా కందకాలు తవ్వి, భూమి కోతను నివారిస్తూ పంటలు పండించడం విశేషం అన్నారు. ఇక్కడ పంటలు పండించే అడవి వ్యవసాయం తో తరతరాలకూ ఆదాయం లభిస్తుంది , శ్రామికులు ఎక్కువ మంది అవసరం ఉండదు అని వివరించారు. రసాయన ఎరువులు, రసాయన కలుపుతీత ముందులు, రసాయన క్రిమి సంహారకాలు వినియోగించకుండా పంటలు పండించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలు ఇక్కడ లభ్యమవుతున్నాయన్నారు ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనూ, తన భార్య ఎన్విరాన్మెంటల్ సైన్స్ చదివుకున్నామన్నారు. ఒక సహజసిద్ధమైన వాతావరణం లో జీవించాలి అనె ఆలోచనతో ఈ విధంగా అడవి వ్యవసాయం చేయడం జరుగుతుంది అన్నారు. దీని ద్వారా చాలామంది యువతనూ, రైతులనూ ప్రభావితం చేసి సమస్త జీవరాశి మనుగడకు కృషి చేయాలని అనుకుంటున్నామన్నారు. ఈ కొండ పొలాన్ని గోవర్ధనపురం గోశాల ప్రతినిధి దొడ్డ మహేష్, మ్యాంగోమేన్ అప్పాజీ, ప్రకృతి వ్యవసాయదారులు నరేష్ తదితరులు సందర్శించారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించిన ఎంపీ హరీష్ బాలయోగి...






**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 8**
డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపు 2026 ను ఎంపి గంటి హరీష్ బాలయోగి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. ఈ సమ్మర్ క్యాంపు లో తమ పిల్లలను చేర్పించి వారిలోని క్రీడా ప్రోత్సాహాన్ని నింపాలని ఎంపీ హరీష్ బాలయోగి కోరారు.

## ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ జిల్లా బ్యూరో ఇంచార్జ్ నాగ శ్రీనివాస్. మే8**
బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నియోజక వర్గం ఉప్పల గుప్తం మండలం కిత్తనచెరువు గ్రామ శివారు పాతాళ దిబ్బ సత్తి శ్రీ నివాస్ రావుమాకుటంబ సభ్యుల సంబంధిత భూములు య. 2.65 సెంట్స్, సర్వే నంబరు లో 501/4 నందు య 2.08 సెంట్స్ , 502/1 నందు య 0.57 సెంట్స్, మా పక్కన ఈ భూమి కి సరి హద్దు రైతులు చెరువులకు అనుమతులు లేకుండా పైన తెలిపిన నేను సాగు చేసు కొనుపంట బోధిని కూడా చెరువులు త్రవ్వి కప్పి యున్నారు, దీని మూలంగా నేను సాగు చేసిన దాల్వా పంట(రెండో పంట) పాడు అయింది.అనుమతులు లేని చెరువులకు ఎలక్ట్రికల్ కేబుల్స్, పర్మిషన్ లేని ఉప్పు నీరు బోరు బావులకు కనెక్షన్స్ఇచ్చి యథేచ్ఛగా సాగు చేయుటకు చెరువులు ఉప్పు నీటితో నింపుచున్నారు. కావున అక్రమ సాగు చెరువులను జిల్లాఅధి కారులు రెవెన్యూబి ఎలక్ట్రికల్బిమత్స్యశాఖబిభూగర్భ జలాలు అధికారులు సమక్షం లో నాకు న్యాయం చెయ్యమని ప్రజాదర్బార్లో వినతి పత్రం స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు కిఇచ్చినాను దానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పై అధికారులకు మీ సమస్యను తెలియజేసి తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# అంబులెన్స్ లేక గంటల తరబడి నిరీక్షణ..

### కేజీహెచ్‌లో విషాద ఘటన





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :08**
విశాఖపట్నంలోని ప్రభుత్వ వైద్య సేవల ప్రతీకగా నిలిచిన కేజీహెచ్ మరోసారి తీవ్ర విమర్శల పాలైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దామన్నపల్లి ఎంపీటీసీ కొర్ర భీమరాజు శుక్రవారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు గంటల తరబడి అంబులెన్స్ అందుబాటులో లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యుల ఆవేదన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్వయంగా కేజీహెచ్‌కు చేరుకుని అంబులెన్స్ ఏర్పాట్లు చేయాల్సి వచ్చిన పరిస్థితి ప్రభుత్వ వైద్య వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రాణాధారంగా ఉన్న కేజీహెచ్‌కు కేవలం ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది పేద ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఆశతో వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు ఇక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులు మాత్రం రోజురోజుకీ పెరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర సేవలు సక్రమంగా అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు, రోగులను నిర్లక్ష్యంగా చూడటం, స్ట్రెచర్ నుంచి అంబులెన్స్ వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు గతంలోనూ అనేకసార్లు వెలుగుచూశాయి. కేజీహెచ్‌లో కొంతమంది సిబ్బంది రోగులతో వ్యంగ్యంగా మాట్లాడటం, పేద ప్రజల నిరుపేద స్థితిని ఆసరాగా చేసుకుని లంచాలు అడుగుతున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. అత్యవసర సమయంలో సేవలు అందాల్సిన చోట, నిర్లక్ష్యం, అవినీతి, అసభ్య ప్రవర్తన కారణంగా ప్రజలు మానసిక వేదనకు గురవుతున్నారని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో చికిత్స ఆలస్యం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగుల ప్రాణాలు పోయాయనే ఆరోపణలపై ప్రభుత్వ స్థాయిలో విచారణలు కూడా జరిగినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇటీవల కాలంలో కేజీహెచ్‌లో వరుసగా వెలుగులోకి వచ్చిన ఘటనలు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూపిస్తున్నాయి. డయాలసిస్ రోగులకు అవసరమైన కాపడ్ ఫ్లూయిడ్ కొరత ఏర్పడి రోగులు తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన, ఆసుపత్రిలో పవర్ ఫెయిల్యూర్ కారణంగా ఐసీయూలు మినహా అనేక వార్డులు చీకట్లో మునిగిపోయిన సంఘటనలు ప్రజల్లో భయాందోళనలు కలిగించాయి. అలాగే ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలు, పరికరాల లోపాల వల్ల వైద్య సేవలు నిలిచిపోయిన ఘటనలు కూడా నమోదయ్యాయి. ఇంతటి కీలక ఆసుపత్రిలో అంబులెన్స్ వంటి ప్రాథమిక సేవలు అందుబాటులో లేకపోవడం ప్రజలను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. "బతికున్నప్పుడు సరైన వైద్యం లేదు... చనిపోయాక మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కూడా వాహనం లేదు అంటే పేదల ప్రాణాలకు విలువ లేదా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పేదలు, గిరిజనులు, మారుమూల ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తమవుతోంది. గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని బాధితులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ తక్షణమే స్పందించి కేజీహెచ్‌లో జరుగుతున్న నిర్లక్ష్యంపై సమగ్ర విచారణ చేపట్టాలని, అంబులెన్స్ సేవలు, అత్యవసర వైద్య సదుపాయాలు, సిబ్బంది ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదల ఆసుపత్రిగా పేరుగాంచిన కేజీహెచ్‌లో మానవత్వం చనిపోకముందే ప్రభుత్వం మేల్కొనాలని ఉత్తరాంధ్ర ప్రజలు వేడుకుంటున్నారు.

## జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో శాంతిభద్రతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష.






**అమలాపురం /అమరావతి సిటిజన్ టైమ్స్ మే 8**
నేరాల కట్టడి, రోడ్ ప్రమాదాలు, సైబర్ నేరాలు వంటి అంశాలపై చర్చ.. గతేడాదితో పోల్చుకుంటే క్రైమ్ రేట్ తగ్గిందని సమావేశంలో ప్రజెంట్ చేసిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా.. మహిళలపై నేరాలు 7%, చోరీలు 8%, ఆర్థిక నేరాలు 0.3%, ఎస్సీ, ఎస్టీలపై నేరాలు 30% తగ్గాయని వెల్లడించిన డీజీపీ...సైబర్ నేరాల్లో మొత్తం రూ.652 కోట్లను బాధితులు కోల్పోయారని.. వీటిల్లో రూ.116 కోట్లు ఫ్రీజ్ చేయగలిగామన్న డీజీపీ. ఆర్థిక నేరాలను కట్టడి చేసే విషయంలో మరింత యాక్టివ్ గా పని చేయాలని సీఎం సూచన...సైబర్, ఆర్థిక నేరాలను కట్టడి చేసేలా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్న ముఖ్యమంత్రి... రోడ్ ప్రమాదాల నివారణకు మరింతగా ఫోకస్ తో పనిచేయాలన్న సీఎం చంద్రబాబు, కన్విక్షన్ రేట్ 2025లో 44 శాతంగా ఉంటే... 2026లో 49.8 శాతానికి పెరిగిందని వివరించిన డీజీపీ....దీన్ని 70 శాతానికి తీసుకువెళ్లాలనే లక్ష్యాన్ని నిర్దేశించిన సిఎం చంద్రబాబు ఇన్ విజిబుల్ పోలీస్...విజిబుల్ పోలీసింగ్ అనేది చేసి చూపించాలన్న ముఖ్యమంత్రి పోలీసుల చర్యలు చూసి నేరం చేయాలంటే భయపడే పరిస్థితి రావాలన్న సిఎం ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... టెక్నాలజీని వినియోగించి ఆధారాలు సేకరించటం, దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలి. సైబర్ నేరాలను నియంత్రించేలా సైబర్ ఫోర్సుతో సైబర్ వార్ రూమ్ ఏర్పాటు చేయాలి, ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్స్ వద్ద ఇతర శాఖలతో కలిసి సమన్వయంతో పనిచేసి ఫలితాలు చూపించాలి. చోరీ కేసుల్లో ఫిర్యాదు వచ్చిన 24 గంటల్లోనే నిందితుడ్ని పట్టుకునేలా చర్యలు ఉండాలి. 50 వేల కేజీల రెడ్ శాండల్ పట్టుకున్నామని.....302 కేసుల నమోదు చేసినట్లు తెలిపిన డీజీపీ, ఎర్రచందనం స్మగ్లింగ్ కేసుల్లో 91 శాతం కన్విక్షన్ నమోదైనట్లు తెలిపిన డీజీపీ, డ్రోన్ల ద్వారా గడచిన ఏడాదిలో 1 లక్ష ఫ్లైయింగ్ అవర్స్ ద్వారా సర్విలెన్స్ పెట్టామని, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలోనూ డ్రోన్ల వినియోగం పెంచామని తెలిపిన డీజీపీ, కుల వివాదాలు, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై తాము పాటించిన విధానాలను వివరించిన పలువురు జిల్లా ఎస్పీలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్ర యూనివర్సిటీ వీసీ



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే 08**
ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ దంపతులుశుక్రవారం సింహాచల పుణ్యక్షేత్రంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారిని సందర్శించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆలయ రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. నాదస్వర వాయిద్యాలు మరియు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వైస్ ఛాన్సలర్ దంపతులు కు ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది. దర్శనానికి ముందు, భక్తుల నమ్మకం ప్రకారం అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని వైస్ ఛాన్సలర్ భక్తిశ్రద్ధలతో ఆలింగనం చేసుకున్నారు. అనంతరం గర్భాలయంలోని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి విశిష్టతను వివరించారు. దర్శనం అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు వైస్ ఛాన్సలర్ దంపతులు కు వేద ఆశీర్వచనం గావించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు వైస్ ఛాన్సలర్ ని స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి ప్రసాదాలను జ్ఞాపికగా స్వామి వారి పటమును అందజేశారు.

## ప్రజల సందేహాలకు రిజిస్ట్రేషన్ శాఖ సమాధానం

### "మన రిజిస్ట్రేషన్ - మన బాధ్యత" కార్యక్రమానికి మంచి స్పందన



**అనకాపల్లి ( సిటిజన్ టైమ్స్ ), మే 08**
ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన ప్రజల సందేహాలను నివృత్తి చేసి అవగాహన కల్పించేందుకు రిజిస్ట్రేషన్ శాఖ చేపట్టిన "మన రిజిస్ట్రేషన్ - మన బాధ్యత" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శుక్రవారం చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ కె. మన్మధరావు పాల్గొని ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. మార్కెట్ వ్యాల్యూ నిర్ణయం, గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్లు, ఫ్రీహోల్డ్ ల్యాండ్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ విధానాలపై ప్రజలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకతతో పాటు ప్రజలకు సులభంగా సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్‌లపై ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగి స్పష్టత పెరుగుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇదే తరహా కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీన సబ్బవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చోడవరం సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కిశోర వికాసం - ఆరోగ్య మేళా అనీమియాపై అవగాహన కార్యక్రమం

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్,, మే 08**
కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత మరియు అనీమియా నివారణపై సైకాలజిస్ట్ డాక్టర్ సునీత బాలికలు కు అవగాహన కల్పించారు. శుక్రవారం నాడు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎలమంచిలి మెప్మా కార్యాలయంలో నిర్వహించిన కిషోర్ బాలికల ఆరోగ్యమేళాలో పాల్గొన్న డాక్టర్ సునీత కిషోర్ బాలికలకు అవసరమైన,ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాల ప్రాముఖ్యత, హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకునే విధానాల గురించి వివరించారు. అలాగే మానసిక ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు మరియు వ్యక్తిత్వ వికాసంపై కూడా సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమ్య , ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ లలిత, కుమారి, రత్నం , ప్రమీల, కిషోర్ బాలికలకు పాల్గొన్నారు.



# విద్యుత్ కార్యాలయం వద్ద ప్రజల అవస్థలు

**బిల్లుల చెల్లింపులకు భారీ క్యూలు**

**సర్వీస్ నంబర్లు మారాయని ఆందోళన**



**కాకినాడ (సిటిజన్ టైమ్స్)మే 08**

విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజలు భారీగా బారులు తీరారు. ఉదయం నుంచే క్యూల్లో నిల్చొని గంటల తరబడి వేచిచూసినా పనులు పూర్తి కాకపోవడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వీస్ నంబర్లు మారాయని, మీ సేవ కేంద్రాల్లో కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని పలువురు ప్రజలు వాపోయారు. కొత్త సర్వీస్ నంబర్ల వివరాలు తెలియక బిల్లులు చెల్లించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గంటల తరబడి క్యూల్లో నిల్చొని ఉన్నవారికి కార్యాలయ సమయం ముగిసిందంటూ తిరిగి పంపించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. సమస్యను వెంటనే పరిష్కరించి, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వినియోగదారులు అధికారులను కోరుతున్నారు.

## ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరగా ప్రభుత్వ పాలన..

**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...**




**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ మే 8**

ప్రజా దర్బార్ ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత దగ్గరగా ఉంటూ, వారి అవసరాలు, సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రతి అధికారి బాధ్యతతో, పారదర్శకంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తేనే ప్రజల సమస్యలకు సమగ్ర పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల నుంచి కూడా ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.మొత్తం 25 వినతులు అందాయని తెలిపారు.

## తలసీమియా అవగాహన ర్యాలీ

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) పి.అమరేందర్**



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ మే 8**

2035 సంవత్సరం వరకల్లా తలసీమియా రహిత భారతదేశం కోసం అందరూ కలిసి పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ తెలిపారు. నేడు ప్రపంచ తలసీమియ దినం సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రపంచ తలసీమియా అవగాహనారాలిని జెండా ఊపి జిల్లా అదనపు కలెక్టర్ పి అమరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసీమియ అనేది వంశపారపర్యంగా వచ్చే జన్యుపరమైన రక్త సంబంధ వ్యాధి. తలసీమియా వ్యాధి లో రక్తంలో హిమోగ్లోబిన్ సరిగా తయారవ్వదు. దీని వలన వీరు తరచుగా రక్తహీనతకు గురవుతారు. కేవలం రక్త పరీక్ష ద్వారా తలసీమియాను గుర్తించవచ్చు. తలసీమియా తీవ్రతను బట్టి కొందరికి తరచుగా రక్తమార్పిడి అవసరం కూడా ఏర్పడుతుంది. క్రమం తప్పకుండా చికిత్సతీసు కోవాలి. పెళ్లికి ముందు రక్త పరీక్షలు, గర్భవతిగా ఉన్నప్పుడు ముందస్తుగా రక్తపరీక్షలు నిర్వహించడం ద్వారా తలసేమియా వాహకులు, వ్యాధిగ్రస్తులను గుర్తించవచ్చు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరి ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, పర్యవేక్షణ సిబ్బంది. ఫసియుద్దీన్, కోట్ర నిరంజన్ ,విజయ్ కుమార్ విజయ్, కొట్ర బాలాజీ, సురేష్ కుమార్, కళ్యాణ్ కృష్ణ,కుమార్ , ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుమల తిరుపతి దేవస్థాన గోపాలకు గ్రాసం పంపిణీ





**కాకినాడ( సిటిజన్ టైమ్స్) మే 8**

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 400 ఎకరాల విస్తృతంలో ఉన్న నాలుగు గోసాలలకు శ్రీ జ్యోతుల నెహ్రు ఫౌండేషన్, శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం160 లారీల ఎండిగడ్డిసరఫరా చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ మాట్లాడుతూ, భారతదేశంలో ఆవుకు చాలా ప్రాముఖ్యత, విలువ ఉన్నాయని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పిలుపునిచ్చారు.భూమాతకు గోమాత ద్వారా ఆహారం లభ్యమవుతుందని తెలుపుతూ, గోవుల వలన ప్రకృతి సమతూల్యత కాపాడవచ్చు అని తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, గోవును రక్షిస్తే దాని ద్వారా భూమి రక్షణ పొందుతుందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడపపడుతున్న నాలుగు గోశాలలకు జగ్గంపేట లో ఉన్న శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్ మరియు శ్రీ జ్యోతుల నెహ్రూ సేవా ట్రస్ట్ వారు 160 లారీల పశుగ్రాసాన్ని పంపడం పట్ల వారిని అభినందించారు. ఈ సందర్భంగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రు మాట్లాడుతూ, తిరుమల తిరుపతి దేవస్థానం వారు గోసాల నిర్వహణ కమిటీ కన్వీనర్ గా మరియు కొనుగోలుకమిటీ కన్వీనర్ గా తనను నియమించి నాపై మరింత బహుత్తరమైన బాధ్యతలు అప్ప చెప్పారని తెలిపారు. గోమాత సంరక్షణ అనేది చాలా కష్టతరమైనదని అయినా సరే ఇటువంటి బాధ్యతలు స్వీకరించడం, గోవులకు సేవ చేయడం అనేది పరమేశ్వరుని దయ ద్వారా తనకులభించిందని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం గోసాలకు పెద్ద మొత్తంలో పశు గ్రాసం అందజేసిన ప్రతి ఒక్కరికి నెహ్రూ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా గోసాలకు రెండు ఆవులను కూడా వితరణ చేశారు ఈ కార్యక్రమంలో గోపూజ లారీలను శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ, జ్యోతుల నెహ్రూ, శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు నిమ్మకాయలు సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం : కమిషనర్ -ఎన్‌వీవీ సత్యనారాయణ**



**కాకినాడ(సిటిజన్ టైమ్స్)మే 8**

ప్రజలనుంచి పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) ద్వారా అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి శాశ్వత పరిష్కారం అందించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి పనిచేస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల సెక్షన్ హెడ్స్‌తో పీజీఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. అర్జీదారులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం ఉండాలని సూచించారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, వాటికి శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**జనగణన-2027కు ప్రణాళికాబద్ధ చర్యలు**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న జనగణన-2027 కార్యక్రమాన్ని కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వెల్లడించారు. జనగణన సర్వే కోసం ఇంటింటికీ వచ్చే సిబ్బందికి కుటుంబ సభ్యుల వివరాలను పూర్తిస్థాయిలో అందించి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ర్యాంకు లక్ష్యం**

స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థకు ఉత్తమ ర్యాంకు సాధించేలా ప్రజలు భాగస్వామ్యం కావాలని కమిషనర్ కోరారు. నగర పరిశుభ్రతపై తమ అభిప్రాయాలను స్వచ్ఛత యాప్ ద్వారా తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్, సెక్రటరీ లక్ష్మి, ఇంజనీరింగ్ విభాగం ఈఈ కనకారావు, టీపీఆర్‌ఓ శైలజ, అకౌంటెంట్ రామశాస్త్రి, సూపరింటెండెంట్ సీతారాం తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ అథ్లెటిక్ దినోత్సవం ఘనంగా నిర్వహించిన క్లాస్ మేట్ క్లబ్

**విద్యార్థులకు క్రీడా పోటీలు.. విజేతలకు బహుమతుల ప్రదానం**

**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్, మే 8:**

ప్రపంచ అథ్లెటిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ధ్యాన్చంద్ అకాడమీలో శుక్రవారం ఘనంగా క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్ తదితర క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. నాగర్‌కర్నూల్ వాసులు, కొల్లాపూర్ క్లాస్మేట్ క్లబ్ మహిళా అధ్యక్షురాలు ఆకుతోట కుసుమ -- విజయ్ కుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఈ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడు కోవాలని సూచించారు. క్రీడలు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొంది స్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ధ్యాన్చంద్ అకాడమీ మల్లేష్, దర్శి



రాజయ్య, పోలా శ్రీనివాసులు, క్లబ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్ జయప్రకాశ్ చారి, కేపీ ప్రసాద్, రమణ కుమార్, సురేందర్, వెంకట్ రాజా తదితరులు పాల్గొన్నారు. క్లాస్మేట్ క్లబ్, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ సభ్యులు కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.

## రూ. కోట్ల నిధులతో డ్రైనేజీ పనులకు శ్రీకారం

**పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**



**పి.గన్నవరం సిటిజన్ టైమ్స్ జిల్లా బ్యూరో ఇంచార్జ్ నాగ శ్రీనివాస్. మే 8**

నియోజకవర్గంలో కాలువలు, డ్రైనేజీల పునరుద్ధరణకు రూ.3.0 కోట్లతో చేపట్టిన పూడికతీత, అభివృద్ధి పనులకు నేడు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శ్రీకారం చుట్టారు. పి.గన్నవరం మండలం సిద్ధార్థ నగర్ వద్ద కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కాలువలు, డ్రైనేజీల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపారు. రైతాంగానికి సమర్థవంతంగా సాగునీరు అందించాలంటే కాలువలను శుభ్రపరచడం,గట్లను బలపరచడం,పిచ్చి మొక్కలు చెట్లను తొలగించడం అత్యవసరమని పేర్కొన్నారు. గతంలో విశాలంగా ఉన్న కాలువలు పడవ రవాణాకు కూడా ఉపయోగపడేవని, ప్రస్తుతం పూడిక, చెట్లు మరియు పిచ్చి మొక్కల కారణంగా నీటి ప్రవాహం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కాలువలను పూర్తిగా శుభ్రపరచి చివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల చివరి ప్రాంతాల్లో ముంపు సమస్యలు ఏర్పడుతున్నాయని,డ్రైన్స్ మరియు అవుట్‌ఫ్లో స్లూయిస్‌లను పునరుద్ధరించి గోదావరిలోకి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సాగునీటి శాఖ అధికారులు, ఎన్డీఏ నాయకులు,ప్రజాప్రతినిధులు, రైతులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ మే 8**

నవధాన్యాల సాగు వల్ల నేల సారవంతమై ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలు లభిస్తాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి రాంబాబు అన్నారు. శుక్రవారం అయినవిల్లి మండలం మండల మహిళా సమాఖ్య కార్యాలయం నందు ఏపిఎమ్ ఎమ్. వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన విచ్చేసి మాట్లాడారు.తొలకరి ముందు నవధాన్యాల సాగు చేపట్టాలని ఆ దిశగా అధికారులు రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తాయని, పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, రైతులకు ఖర్చులు తగ్గుతాయని, మరొక ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు రైతులకు సూచించారు. అనంతరం రైతులకు నవధాన్యాల కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శోభ, ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం శ్రీనివాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె. సత్యాదేవి, సెక్రటరీ పి సత్యవతి, కోశాధికారి పి ప్రశాంతి, సీసీ కే. వెంకటలక్ష్మి, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది ఎం.జగదీశ్వరి దుర్గా లక్ష్మి ,ఐసి ఆర్ పి లు, రైతులు వివోఏలు పాల్గొన్నారు.

## జిల్లాలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్**



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ మే 8**

నాగర్ కర్నూల్ కలెక్టరేట్లో తన చాంబర్లో శుక్రవారం అదనపు కలెక్టర్ అమరేందర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 13 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో 18 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4830 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1727 మంది పరీక్షలకు, మొత్తం 6557 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఏర్పాటు చేయాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేసవికాలంలో దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు, గాలి, వెలుతురు స్పష్టంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ డీఈఓ రమేష్ కుమార్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ, బి.ఈడి ప్రవేశ పరీక్షల నిర్వహణపై కమిటీ సభ్యులకు అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు





**అమలాపురం, సిటిజన్ టైమ్స్ మే 08**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు, ఏపీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ బీఈడీ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నిధియాదేవి అధికారులను ఆదేశించారు.శుక్రవారం పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుల తో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, బీఈడీ ఎంట్రెన్స్ పరీక్షలు నిర్వహ ణపై పలు ఆదేశాలు జారీ చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యా ర్థులకు ఎటువంటి ఇబ్బం దులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎగ్జా మినేషన్ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.?ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21 నుండి జూన్ 4వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యా హ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవ త్సరాలకు సంబంధించి మొత్తం 14,171 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.వీరి కొరకు ?జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రశ్నపత్రాలను జిల్లాలోని 14 పోలీస్ స్టేషన్లలో అత్యంత పకడ్బందీగా భద్రపరచడం జరుగుతుందన్నారు.??పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా శాంతిభద్రతల పర్యవేక్షణకు జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ బందో బస్తు చర్యలు చేపట్టాలన్నారు.?ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల రవాణాకు ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంచాలని రెవెన్యూ శాఖకు సూచించారు.?పరీక్ష సమయంలో కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ మరియు ఇంటర్నెట్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని జాయిశీట్ కలెక్టర్ ఆదేశించారు.? ఏపీ ఈపీడీసీఎల్ వారు పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీల నిర్వహణకు, విద్యార్థుల సౌకర్యార్థం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. మున్సిపల్ ఒ పంచాయతీ అధికారులు వేసవి దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద సరి పడా త్రాగునీటి వసతి కల్పించాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్స కిట్లు మరియు సిబ్బందితో కూడిన వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ వారు విద్యార్థుల రాకపోకలకు వీలుగా పరీక్షా కేంద్రాల రూట్లలో ప్రత్యేక బస్సులను నడపాలన్నారు.?బీఈడీ ప్రవేశ పరీక్షలు (ఏపీ ఈ డి సెట్) ?ఈ నెల 8వ తేదీన జిల్లాలో బీఈడీ, స్పెషల్ బీఈడీ ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాలో రెండు ప్రధాన పరీక్ష కేంద్రాలను కేటాయించారని ఒకటి ?శ్రీనివాస ఇంజనీరింగ్ కాలేజీ చెయ్యేరు (కాట్రేనికోన మండలం). రెండవది ?బి.వి.సి ఇంజనీరింగ్ కాలేజీ (భట్లపాలెం).?లలో ఈ పరీక్షలను కూడా అత్యంత పారదర్శకంగా, విజయ వంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి.సుబ్బా రావు, జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి చంద్రశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్లు వి.నిర్మల్ కుమార్ రాజు, అదనపు డి.ఎం.అండ్. హెచ్.ఓ.సిహెచ్ వి. భరత లక్ష్మి, జిల్లా అగ్ని మాపక అధికారి పార్థసారథి, డిపిఓ శాంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 12 నుండి ఎప్సెట్‌బి 2026 పరీక్షలు

## నిమిషం ఆలస్యమైన పరీక్షకు గైర్హాజరే -జూన్ 1న ఫలితాలు

### ఏపి ఎప్సెట్ చైర్మన్ ప్రసాద్ వెల్లడి

**కాకినాడ, (సిటిజన్ టైమ్స్) మే 8**

ఏపీ ఎప్సెట్ బి 2026 పరీక్షలు ఈనెల 12, 13, 14, 15, 18 తేదీలలో ఇంజనీరింగ్ పరీక్షలు, 19, 20 తేదీలలో అగ్రికల్చర్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎప్సెట్‌బి 2026 చైర్మన్, జేఎన్టీయూ విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలకు ఇంజనీరింగ్ విభాగానికి రెండు లక్షల 75 వేల 784, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 78,435 మందితో పాటు మొత్తం మూడు లక్షల 55 వేల 11మంది పైగా నమోదైనట్లు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం జేఎన్టీయూలోని విసి చాంబర్లో విలేకరులతో సమావేశం నిర్వహించి ఎప్సెట్ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఈ పరీక్షలను రాష్ట్రంలో 142 కేంద్రాల ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయానికి రెండు గంటల ముందే చేరుకోవాలని ఒక్క నిమిషం దాటిన లోనికి పరీక్ష రాసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 23వ తేదీన కీ విడుదల చేస్తామని అందులో ఏమైనా అభ్యంతరాలు



ఉంటే వాటిని స్వీకరించి నిపుణులతో చర్చించి దానికి సమాధానం అందిస్తామని చెప్పారు. వీలైనంతవరకు జూన్ ఒకటవ తేదీన పరీక్షా ఫలితాలను వెల్లడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విసి ప్రసాద్ చెప్పారు. ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ మోహన్ రావు మాట్లాడుతూ ఏప్రిల్ 28వ తేదీ నుంచి విద్యార్థులకు అవసరమైన హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకునే అవకాశం ప్రభుత్వం వెబ్సైట్ల ద్వారా కలిపించిందన్నారు. పరీక్ష రాసే సెంటర్లో సీసీటీవీలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో ఓఎస్డి డి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పరీక్ష పూర్తి ఆన్లైన్లోనే నిర్వహిస్తున్నామని అందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ హరీష్ మాధుర్ ఎమ్మెల్యే సుబ్బరాజు



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ జిల్లా బ్యూరో ఇన్చార్జ్ నాగ శ్రీనివాస్ మే 8**

నగర పంచాయతీ పరిధిలో 5 పనులకు వివిధ వార్డులలో సబ్ ప్లాన్ నిధులతో రూ.64,70,000/- (అరవై నాలుగు లక్షల డెబ్బై వేలు) 15వ ఆర్థిక సంఘం నిధులతో 3 పనులకు రూ.36,40,000/-(ముప్పై ఆరు లక్షల నలబై వేలు) ఎం.పి. లాడ్స్ ద్వారా ఒక పనికి గాను సుమారు రూ.32,00,000 (ముప్పై రెండు లక్షలతో) నిర్మాణం చేసిన సి.సి., బి.టి రోడ్లను మొత్తం 9 పనులకు గాను రూ. 1,33,10,000/- (ఒక కోటి ముప్పై మూడు లక్షల పదివేల రూపాయలతో) పట్టణంలో 5 చోట్ల సుమారు రూ.3,00,000/- లతో (మూడు లక్షలతో) ఏర్పాటు చేసిన చలివేంద్రములను, వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన మంచి నీటి వాటర్ ట్యాంకర్ ను ప్రభుత్వ విప్ శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధూర్ బాలయోగి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్ట బోయే 3 పనులకు సుమారు రూ. 17,39,326/- లతో ఎ.పి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో చేపట్టబోయే 6 పనులకు గాను సుమారు రూ.88,50,000/- లతో మొత్తం 9 పనులకు రూ.1,05,89,326/- (ఒక కోటీ 5 లక్షల ఎనభై తొమ్మిది వేల మూడు వందల ఇరవై ఆరు రూపాయలతో) శంఖుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.రవివర్మ , చెల్లి వివేకానంద, గుత్తుల సాయి,చెల్లి అశోక్ , దాట్ల పృధ్వీరాజు , కట్టా సత్తిబాబు, ఎం. బాలకృష్ణ , తాడి నరసింహారావు, దొమ్మేటి రమణ కుమార్ ,తాడి జానకిరాం, అడబాల సతీష్ ,కదలి నాగు, విళ్ళ వీరా స్వామి నాయుడు, కాశి లాజర్, బొక్కా రుక్మిణి, మెండి కమల,, ఎ.ఇ. కె.శ్రీనివాసు,ఆర్.పి.లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సచివాలయ, మెప్మా నగర పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యానిధి విద్యా సంస్థల అధినేత ఔదార్యం

**వికలాంగ విద్యార్థినికి చేయూతగా ఉచిత విద్య – విద్యానిధి నాయుడుకి అభినందనల వెల్లువ.**





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 8**

వికలాంగురాలు అయినప్పటికీ దృఢ సంకల్పంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600కు గాను 567 మార్కులు సాధించిన కొమ్మన మంజుశ్రీ మహాలక్ష్మికి ఎవరైనా ఉదారవాదులు సహకరిస్తే ఐఐటి చదువుతుందనే ప్రకటనను చూసిన,అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఆకుల బాపన్నాయుడు స్పందించారు.నిరుపేదలకు తన పాఠశాలలో చదివే వారికి ఫీజులు రాయితీఇస్తూ, విద్య దానం చేసే ఉదార గుణము గల విద్యానిధి అధినేత తన కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్ ని వారింటికి పంపించి, విద్యా నిధి కళాశాలలో మంజు శ్రీ మహాలక్ష్మికి ఉచితంగా ఇంటర్ విద్యను అందించేందుకు తాము సిద్ధం అని తల్లి దండ్రులకు తెలియజేసారు. పేద కుటుంబమునకు చెందిన చదువుల తల్లికి సహకారం అందించేందుకు ముందడుగు వేసిన నాయుడు స్పందించే హృదయానికి ఉపాధ్యాయ వర్గం తరపున ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# నిత్యవసర వస్తువులు ఆర్థిక సహాయం అందజేసిన జనసేన నాయకులు



**మమ్మిడివరం సిటిజన్ టైమ్స్ మే 8**

నియోజకవర్గం లోని, సోమి దేవరపాలెం గ్రామానికి చెందిన ముడిదొడ్డి చంద్రరావు(క్యాన్సర్ పేషెంట్)అతని కుమారుడు శ్రీను(కిడ్నీ పేషెంట్)ల ఆర్థిక ఇబ్బందులు, అడబాల మనోజ్ ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్, జనుపల్లి గ్రామానికి చెందిన మద్దింశెట్టి జాను,సునీత దంపతుల కుమారుడు ప్రణవ్ రుద్రాన్స్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో 2000 రూపాయలు విలువైన నిత్యవసర వస్తువులు, 2000 రూపాయలు ఆర్థిక సహాయం స్థానిక జనసేన నాయకులు అడబాల రామకృష్ణ చేతులమీదుగా ఇవ్వటం జరిగింది.దీనికి గాను చంద్రరావ, అతని కుమారుడు బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ బాబు తల్లిదండ్రులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో మోహన్ రావు పాల్గొన్నారు.

# పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ బహిరంగ సభ: విజయవంతం చేయాలని కిషన్ రెడ్డి పిలుపు

**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, మే 08**

ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారతీయ జనతా పార్టీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సభ సన్నాహకాల్లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి వేల సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని నేతలు కోరారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రాష్ట్రంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పెట్రోలియం ఉత్పత్తుల టెర్మినల్ ప్రారంభోత్సవం, బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులు మరియు కాజీపేట--విజయవాడ మూడో రైల్వే లైన్, కాజీపేట--పెద్దపల్లి బైపాస్ పనులు, రాష్ట్రానికి ఐదు వందే భారత్ రైళ్ల కేటాయింపు పనులను ప్రధాని ప్రారంభించానున్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవి కుమార్ యాదవ్ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి అలె ప్రభాకర్ రాజ్, మాజీ ఎమ్మెల్యే మారబోయిన భిక్షపతి యాదవ్, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.



# బడి పిలుస్తోందిలో ఎన్రోల్మెంట్ డ్రైవ్...







**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 8:**

మోడల్ ప్రైమరీ స్కూల్ గొంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు బడి పిలుస్తోందిలో భాగంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు డి. కిషోర్ కుమార్, యం. వేంకటేశ్వర రావు, గొంది స్పెషల్ ఆఫీసర్ ఎస్. రాకేష్ చేతులు మీదుగా ఘనంగా సన్మానము నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు డి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు పథకాలు,అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ఈ పాఠశాల అత్యధిక మార్కుల చూసి తల్లిదండ్రులు అందరూ ప్రభుత్వ పాఠశాలలలో జాయిన్ చేయాలని కోరారు. గొంది స్పెషల్ ఆఫీసర్ ఎస్ రాకేష్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలలో చదువుకొని ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. ఇంటింటికి తిరిగి ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించి, విద్యార్థులను జాయిన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జ్యోతి రత్న ప్రసాద్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, పేరెంట్ కమిటీ సభ్యులు, యన్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ పూజలు..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 8:**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామ పంచాయతీ లో నూతన ఆలయ పునర్ ప్రతిష్ట హోమం ప్రత్యేక పూజలును వైభవంగా నిర్వహించినారు. అయులూరి సూర్య కుమార్ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ స్వర్ణ భాస్కర శర్మ ఆచార్యత్వమున విఘ్నేశ్వర పూజ, వాస్తు పూజ, వాస్తు హోమం, బింభసుద్ధి, క్షీరదివాసం, ధన్యాదివాసనం, పంచ శయదివాసనం, పుష్పాదివాసం, శాంతి కుంభస్థాపన, నీరాజన మంత్ర పుష్పాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, బ్రాహ్మణులు, పూజా స్వాములు, శ్రీ లక్ష్మీ నరసింహ యువత, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కొమరగిరిపట్నం తీరంలో ఇసుకత వ్వకాలపై మైనింగ్ అధికారుల దాడులు

**అల్లవరం సిటిజన్ టైమ్స్ మే7**

మండలం లోని కొమరగిరిపట్నం తీరంలో ఇసుక తవ్వకాలపై జిల్లా మైనింగ్ అధికారులు అర్ధరాత్రి దాడులు చేశారు. కొమరగిరిపట్నం లోని సముద్ర తీర ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాలు వద్దకు వెళ్లి ఇసుకను తవ్వుతున్న జేసీబీ సీజ్ చేసి రూ.2 లక్షలు పెనాల్టీ విధించారు.. కొమరగిరిపట్నం తీరం నుంచి అక్రమంగా తవ్వి ఇసుకను తరలిస్తున్న రెండుటిప్పర్లు ను అధికారులు సీజ్ చేసారు. అల్లవరం పోలీస్ స్టేషన్ కు మైన్స్ అధికారులు అప్పగించినట్లు సమాచారం. పక్కా సమాచారంతో అర్ధరాత్రి మైన్స్ అధికారులు దాడులు చేశారు. అధికారులకు పక్కా సమాచారంతో పాటు ఫోన్ లో ఎప్పటికప్పుడు సమాచారం అందించి పట్టించిన ఓ అజ్ఞాత వ్యక్తి..?కొమరగిరిపట్నం సముద్ర తీర ప్రాంతంలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై గత నెల రోజులుగా పలు పత్రికల్లో వరుస కథనాలు పిలవడ్డాయి. అధికారుల దాడులతో ఎక్కడిక్కడే టిప్పర్ల ను నిలిపివేసి కనపడకుండా వాహన యజమానులు దాచి వేశారు.



## దేవరపల్లి గ్రామంలో అగ్ని ప్రమాదం

### దగ్ధమైన ఇంటిని పరిశీలించి బాధితులను పరామర్శించిన వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం సిటిజన్ టైమ్స్ మే 8**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామంలో ఇటీవల బొక్కా వెంకటేశ్వరరావు ఇల్లు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో జగ్గిరెడ్డి, గ్రామ వైఎస్ఆర్ సీపీ నాయకులు సహాయం చేస్తూ రూ.25,000 వేల రూపాయల నగదు అందజేశారు. చిర్ల జగ్గిరెడ్డి గారు బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పుతూ, చాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమలాపురం బాలయోగి స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు

### ఎంపీ గంటి హరీష్ తో కలిసి సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ జిల్లా బ్యూరో ఇంచార్జ్ నాగ శ్రీనివాస్. మే 8**

పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన జీఎంసీ బాలయోగి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ – 2026ను గౌరవ అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, దివంగత గంటి మోహనచంద్ర బాలయోగి ఈ ప్రాంత అభివృద్ధికి, ముఖ్యంగా క్రీడా రంగానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నిర్మితమైన ఈ స్టేడియం ఎంతో మంది క్రీడాకారులకు వేదికగా నిలిచిందని, నేడు వారి కుమారుడు గంటి హరీష్ బాలయోగి అదే స్ఫూర్తితో యువత ప్రయోజనం కోసం క్రీడలను ప్రోత్సహించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. హరీష్ గారి నాయకత్వంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం శిబిరానికి విచ్చేసిన పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, “మీరే రేపటి తరం విజేతలు, ఆటల్లో గెలుపోటముల కంటే పట్టుదల ముఖ్యం” అని పిల్లల్లో ఉత్సాహం నింపారు. వేసవి సెలవుల్లో సెల్ ఫోన్లకు దూరంగా ఉండి, మైదానంలో చెమట చిందిస్తూ క్రమశిక్షణతో కూడిన క్రీడలను నేర్చుకోవాలని పిల్లలను ప్రోత్సహించారు. ఈ మే 1 నుండి 31 వరకు జరిగే శిక్షణలో బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, ఫుట్ బాల్ వంటి క్రీడల్లోలి మెళకువలు నేర్చుకుని రాష్ట్ర మరియు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సెలవుల్లో పిల్లల ఇష్టాలను గౌరవిస్తూ, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం క్రీడల వైపు పంపిస్తున్న తల్లిదండ్రులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. వృత్తిపరమైన కోచింగ్ ద్వారా పిల్లలు శారీరక దృఢత్వాన్ని, మానసిక వికాసాన్ని పొందుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పెచ్చెట్టి విజయలక్ష్మి, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి, యాళ్ళ సతీష్ మరియు సాప్ అధికారులు, కోచ్‌లు అధిక సంఖ్యలో క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యకు చెక్

### ఎల్లమ్మబండ 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు వేగవంతం – పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మే 08**

నియోజకవర్గంలో ట్రాఫిక్ రహిత సమాజం కోసం మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుండి గాజులరామరం వరకు (వయా ఎల్లమ్మబండ) జరుగుతున్న 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్న ఈ మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు మధ్యలో ఉన్న అడ్డంకులు, బండరాళ్లను వెంటనే తొలగించాలని సూచించారు. రోడ్డు డివైడర్ల నిర్మాణం మరియు విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను ఇప్పటికే స్థానభ్రంశం చేశామని, మిగిలిన పనులను వివిధ శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు మధ్యలో డివైడర్ల వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని, ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ప్రజలకు సమయం మరియు ఇంధనం ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లిని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హరికృష్ణ, వాసులు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలకు పాతర.. అర్ధరాత్రి వరకు యథేచ్ఛగా మద్యం విక్రయాలు! సిట్టింగ్‌లు














**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్, మే 8**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయి. వైన్స్ షాపుల యజమానులు ప్రభుత్వ సమయ పాలనను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటలకే మద్యం విక్రయాలు నిలిపివేయాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**సమయం దాటినా ఆగని విక్రయాలు:**

నాగర్‌కర్నూల్‌లోని నెల్లికొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న 'వైన్స్ వద్ద నిబంధనలు గాలికొదిలేశారు. రాత్రి 10 గంటలు దాటినప్పటికీ షాపు ప్రధాన షట్టర్లు వేసి, పక్కనే ఉన్న గది లేదా సిట్టింగ్ ఏరియా ద్వారా విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అందించిన ఫోటోల ప్రకారం, మే 08వ తేదీ రాత్రి 10:04 గంటల సమయంలో కూడా మద్యం దుకాణం బోర్డు వెలుగుతూనే ఉంది.

**సిట్టింగ్ రూమ్‌లలో కిటకిట:**

మద్యం దుకాణాల పక్కన ఉండే సిట్టింగ్ రూమ్‌లు నిర్ణీత సమయం తర్వాత కూడా నడుస్తుండటం గమనార్హం. రాత్రి 10 గంటలకే మద్యం విక్రయాలు బంద్ చేశామని బయటకు కనిపిస్తున్నప్పటికీ, లోపల మాత్రం సిట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. 10:03 గ్రావీ సమయంలో తీసిన చిత్రాలలో సిట్టింగ్ రూమ్‌లో టేబుళ్ల నిండా మద్యం బాటిళ్లతో మందుబాబులు గుంపులు గుంపులుగా కూర్చుని ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది.

**నిఘా ఏది?..:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి వైన్స్ షాపులు మరియు పెర్మిట్ రూమ్‌లు మూసివేయాలి. కానీ, నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా అర్ధరాత్రి వరకు వీటిని నడుపుతున్నారు. నివాస ప్రాంతాలకు సమీపంలో ఇలా అర్ధరాత్రి వరకు సిట్టింగ్‌లు నడపడం వల్ల స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి, సమయ పాలన పాటించని ఇలాంటి మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రతి రేషన్ దారుడికి ఈ కేవైసీ తప్పనిసరి

### జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్



**అమలాపురం సిటిజన్ టై మ్స్ మే 8**

రేషన్ ప్రజా పంపిణీ వ్యవస్థలోని రేషన్ కార్డు సభ్యులందరూ వెంటనే తమ సమీపంలోని రేషన్ దుకాణానికి లేదా గ్రామ,వార్డు సచివాలయానికి వెళ్లి తమ వేలిముద్రలు వేసి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కొరకు ప్రతి లబ్ధిదారుడు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి,రేషన్ పంపిణీలో అక్రమాలను పూర్తిగా అరికట్టడానికి రేషన్ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రి యను పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్ కోరారు. బయోమెట్రిక్ వేలిముద్రలు లేదా ఐరిస్ (కంటిపాప) గుర్తింపు ద్వారా కార్డులోని సభ్యుల వివరాలను ధ్రువీకరించడం జరుగుతుందని, తద్వారా లబ్ధిదారులకు, ప్రభుత్వానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయని, ఆయన వివరించారు.?ఈ-కేవైసీ వల్ల కలిగే కీలక ప్రయోజనాలు ఉన్నాయని?అక్రమాల నిరోధం గతంలో మరణించిన వారు లేదా గ్రామంలో లేని వారి పేర్ల మీద రేషన్ తీసుకునే అవకాశం ఉండేదని, ఈ-కేవైసీ ద్వారా అటువంటి నకిలీ లబ్ధిదారులను గుర్తించి తొలగించడం సులభమవుతుందన్నారు.?పారదర్శకత జవాబుదారీతనం తీసుకుని వచ్చేందుకు వీలుగా పంపిణీ అయ్యే ప్రతి కేజీ బియ్యం ఖచ్చితంగా ఎవరికి చేరుతుందో ఆన్‌లైన్‌లో నమోదవుతుందన్నారు. దీనివల్ల డీలర్లు సరుకులను పక్కదారి పట్టించే అవకాశం ఉండదన్నారు. ?ఒన్ నేషన్ – ఒన్ రేషన్ కార్డ్: ఈ-కేవైసీ పూర్తయిన లబ్ధిదారులు దేశంలో ఎక్కడ ఉన్నా, ఏ చౌక ధరల దుకాణం నుండైనా తమ సరుకులను పొందే వీలుంటుందన్నారు. ఇది ముఖ్యంగా వలస కార్మికులకు గొప్ప వరమన్నారు.వివిధ?సంక్షేమ పథకాల అనుసంధానం కొరకు ఈకేవైసీ బాధప డుతుందని కేవలం రేషన్ మాత్రమే కాకుండా, ఆరోగ్యశ్రీ, పెన్షన్లు ఇతర ప్రభుత్వ పథకాలు నిరంతరాయంగా అందాలంటే రేషన్ కార్డులో ఈ-కేవైసీ అప్‌డేట్ అవ్వడం తప్పనిసరన్నారు. రేషన్ కార్డులో సభ్యులందరికీ ఈ-కేవైసీ పూర్తయిందో లేదో ఒకసారి సరి చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో భవిష్యత్తులో రేషన్ సరుకులు మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని డీఎస్ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

## మస్కట్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్న మహిళ స్వదేశానికి సురక్షితంగా రాక: జిల్లా కలెక్టర్ కృషితో ఇంటికి చేరిన కె. లక్ష్మి,



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 8**

జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ చొరవతో మస్క ట్‌లో చిక్కుకున్న వాసాల తిప్పకు చెందిన కె. లక్ష్మి క్షేమంగా స్వగ్రామానికి చేరుకుంది. ఆర్థిక ఇబ్బం దుల రీత్యా ఉపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడ నరకయాతన అనుభ వించిన కోనసీమ జిల్లా, వాసాల తిప్ప గ్రామానికి చెందిన కె. లక్ష్మి సురక్షి తంగా స్వదేశానికి చేరుకున్నారు.కుటుంబ పోషణ నిమిత్తం గత ఏడాది సెప్టెంబర్ 8న ఏజెంట్ ద్వారా మస్కట్ వెళ్లిన లక్ష్మి, అక్కడ ఒక ఇంట్లో పనిలో చేరారు. యజమాని కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక తనను రక్షించాలని భర్త శ్రీనివాస రావు ద్వారా జిల్లా యం త్రాంగాన్ని ఆశ్రయించారు. బాధిత కుటుంబం కలెక్టరే ట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ను సంప్రదించగా నోడల్ అధికారి వి. సుబ్బారావు, సమన్వయకర్త గోళ్ళ రమేష్ సహాయక చర్యలు చేపట్టారు.?యంత్రాంగం సదరు ఏజెంట్‌తో ఎప్పటిక ప్పుడు సంప్రదిం పులు జరిపి, లక్ష్మి ఎదుర్కొంటు న్న ఇబ్బందులను వివరించి ఆమె తిరుగు ప్రయాణానికి మార్గం సుగమం చేశారు.?అధి కారుల పర్యవేక్షణలో, కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెను క్షేమంగా ఇండియాకు రప్పించారు.?తమను ఆదుకున్న జిల్లా కలెక్టర్‌కు, మైగ్రేషన్ సెంటర్ బృందానికి లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కడియాల సత్తిబాబు, షేక్ బీబి సఫియా తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు బ్యాంకులు చెక్ పెట్టాలి

### సైబరాబాద్ సీపీ రమేష్




**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, మే 8**

సైబర్ నేరాలను అరికట్టడంలోను నిందితులను పట్టుకోవడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ స్పష్టం చేశారు. మ్యూల్ అకౌంట్ల (ఇతరుల పేరుతో ఉండే ఖాతాలు) నియంత్రణ, దర్యాప్తులో సమన్వయంపై చర్చించేందుకు కమిషనరేట్ కార్యాలయంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబరాబాద్ పరిధిలో 2025లో రూ. 438 కోట్లు, 2026లో ఇప్పటివరకు రూ. 104 కోట్లు ప్రజలు కోల్పోయారని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.బ్యాంకులకు కీలక సూచనలు ప్రతి బ్యాంకులో ప్రత్యేక సైబర్ సెల్ మరియు సైబర్ క్రైమ్ రెస్పాన్స్ డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాతా వివరాలు, కేవైసీ (ఖ్జ) పత్రాలను పోలీసులకు సకాలంలో అందజేయాలి. మ్యూల్ అకౌంట్లపై నిఘా పెంచి, అనుమానాస్పద లావాదేవీలను వెంటనే గుర్తించాలి. ఒకసారి ఖాతాను ఫ్రీజ్ చేసిన తర్వాత ఎలాంటి డెబిట్ లావాదేవీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఖాతాల ఫ్రీజ్ మరియు డిఫ్రీజ్ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యం వల్ల నిందితులు తప్పించుకుంటున్నారని సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్ పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ల వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించవచ్చని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో డీసీపీలు కోటి రెడ్డి, ముత్యం రెడ్డి, సాయి మనోహర్, ఎస్పీ సాయి శ్రీతో పాటు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి ప్రముఖ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. డిజిటల్ మోసాల బారిన పడకుండా ఉండటమే కాకుండా, బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా బ్యాంకులు పోలీసులతో కలిసి పనిచేయాలని సీపీ తెలిపారు.



## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిరియాల రాఘవ రావు, ప్రీతమ్



**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, మే 08**

రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. శుక్రవారం నాడు మిరియాల రాఘవ రావు, మిరియాల ప్రీతమ్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో వారు పొన్నం ప్రభాకర్‌తో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, మరెన్నో ఉన్నత పదవులను అధిరోహించి ప్రజాసేవలో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధిలో బీసీ వర్గాల సంక్షేమంలో మంత్రి పోషిస్తున్న పాత్రను వారు కొనియాడారు. ఆయన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం మరింత పురోభివృద్ధి సాధించాలని, సామాన్య ప్రజలకు ఆయన సేవలు మరిన్ని అందాలని వారు ఈ సందర్భంగా కోరుకున్నారు.

# నిధి ది గ్రేట్: చద్దన్నం కారణంగా అంత ముద్దొస్తోంది!



పాయల్ రాజ్‌పుత్: నిర్భయ ఎంపికలతో రైజింగ్ స్టార్





రోజ్ సర్దానా సింప్లిసిటీ అనేది అల్టిమేట్ స్టైల్ స్టేట్‌మెంట్ అని నిరూపించింది

సౌందర్యానికి, ఫిట్‌నెస్‌కు కేవలం ఖరీదైన డైట్ ప్లాన్‌లు మాత్రమే అవసరం లేదని.. మన ఇంటి పాతకాలపు వంటకాలు కూడా అద్భుతాలు చేస్తాయని నిధి అగర్వాల్ నిరూపిస్తున్నారు. బూరె బుగ్గలు, కాటుక కళ్లు, ఒంపుసొంపుల నడుముతో కుర్రకారును మంత్రముగ్ధులను చేసే ఈ భామ తన గ్లామర్ రహస్యం -చద్దన్నం- అని వెల్లడించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వేకువఝామునే చద్దన్నం తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అపారమని, ఇది శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే కాకుండా చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తుందని ఆమె తన అనుభవాన్ని షేర్ చేసారు. నిధి అగర్వాల్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... గత ఏడాది కాలంగా తన ఫేవరెట్ బ్రేక్‌ఫాస్ట్ చద్దన్నమేనని తెలిపారు. షూటింగ్ సెట్స్‌లో అందరూ మోడ్రన్ డైట్ ఫుడ్ తింటుంటే.. తాను మాత్రం క్యారేజ్‌లో చద్దన్నం తెచ్చుకుని తినడం చూసి యూనిట్ సభ్యులు ఆశ్చర్యపోతుంటారని నిధి నవ్వుతూ చెప్పారు. చద్దన్నంలో ఉండే ప్రోబయోటిక్స్ రోగనిరోధక శక్తిని పెంచుతాయని.. కరోనా వంటి వైరస్‌ల నుండి రక్షణనిస్తాయని గతంలో వైద్యులు కూడా పేర్కొన్నారు. నిధి తన ఆహారంలో చద్దన్నంతో పాటు ప్రొటీన్ కోసం కోడిగుడ్లను కూడా తీసుకుంటూ పక్కాగా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నారు. కెరీర్ పరంగా చూస్తే.. పవన్ కళ్యాణ్ సరసన నటించిన -హరి హర వీరమల్లు- నిధి కెరీర్ లో భారీ సినిమా.. కానీ ఆశించిన ఫలితం రాలేదు. అయినా కేవలం అందాల ప్రదర్శనకే పరిమితం కాకుండా.. వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ తానొక పర్ఫార్మర్ అని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా పెద్ద హీరోల సినిమాల్లో లక్కీ ఛార్మ్‌గా మారిన నిధి ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచారు. రెబల్ స్టార్ ప్రభాస్ సరసన నటించిన -ది రాజా సాబ్- కూడా తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుతం నిధి తన తదుపరి సినిమాలపై దృష్టి సారించింది. ప్రస్తుత ఆధునిక ప్రపంచం అనవసర పోకడలకు పోకుండా మన సంప్రదాయ ఆహారపు అలవాట్లే మిమ్మల్ని అందంగా ఉంచుతాయని నిధి అగర్వాల్ చెప్పడం విశేషం. చద్దన్నం లాంటి స్వదేశీ ఆహారం వల్ల మంచి నిద్ర పడుతుందని, అది మానసిక ప్రశాంతతను ఇచ్చి ముఖంలో గ్లో పెంచుతుందని నిధి నిరూపించారు. గ్లామర్ ఫీల్డ్‌లో ఉంటూ కూడా ఇలాంటి సింపుల్ లైఫ్ స్టైల్‌ను అలవర్చుకోవడం వల్లే -నిధి ది గ్రేట్- అనిపించుకుంటున్నారు. తదుపరి చిత్రాలతో మరిన్ని విజయాలను అందుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# ఐపీఎల్‌లో భారీ మార్పులు.. 2028 నుంచి 94 మ్యాచ్‌ల మెగా టోర్నీ!

- **2028 నుంచి ఐపీఎల్‌ను 94 మ్యాచ్‌లకు విస్తరించాలని బీసీసీఐ ప్రణాళిక**
- **10 జట్లకు పూర్తిస్థాయి హోమ్ అండ్ అవే ఫార్మాట్‌ను తిరిగి ప్రవేశపెట్టే యోచన**
- **కొత్త జట్లను చేర్చే ఆలోచన లేదన్న ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్**
- **టోర్నీ మధ్యలో తగ్గుతున్న ఆసక్తిని నిలబెట్టి, అభిమానులకు స్పష్టత ఇవ్వడమే లక్ష్యం**
- **ఈ ప్రణాళిక అమలుకు ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్‌లో ప్రత్యేక విండో అవసరం**



ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన టీ20 లీగ్ ఐపీఎల్ స్వరూపాన్ని సమూలంగా మార్చేందుకు బీసీసీఐ భారీ ప్రణాళికలు రచిస్తోంది. 2028 సీజన్ నుంచి టోర్నీలో మ్యాచ్‌ల సంఖ్యను ఏకంగా 94కి పెంచాలని, పది జట్లకు పూర్తిస్థాయిలో హోమ్ అండ్ అవే ఫార్మాట్‌ను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మార్పు ద్వారా టోర్నీని మరింత ఆకర్షణీయంగా, అభిమానులకు మరింత సులభంగా అర్థమయ్యేలా చేయాలన్నది బోర్డు ప్రధాన ఉద్దేశం.

**పూర్తిస్థాయి హోమ్ అండ్ అవే ఫార్మాట్ దిశగా అడుగులు**

ప్రస్తుతం ఐపీఎల్‌లో 10 జట్లు ఉన్నప్పటికీ, 'వర్చువల్ గ్రూప్' విధానం అమలవుతోంది. దీనివల్ల ప్రతి జట్టూ అన్ని జట్లతో రెండేసి సార్లు తలపడటం లేదు. ఈ గందరగోళానికి తెరదించి, పాత పద్ధతిలో ప్రతి జట్టూ మిగిలిన తొమ్మిది జట్లతో రెండేసి మ్యాచ్‌లు (ఒకటి స్వదేశంలో, మరొకటి ప్రత్యర్థి గడ్డపై) ఆడేలా కొత్త ఫార్మాట్‌ను తీసుకురావాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ విధానంలో ప్రతి జట్టు లీగ్ దశలో 18 మ్యాచ్‌లు ఆడుతుంది. దీంతో టోర్నీ మొత్తం మ్యాచ్‌ల సంఖ్య ప్రస్తుత 74 నుంచి 94కి పెరుగుతుంది. ఈ ప్రణాళికలను ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ స్వయంగా ధ్రువీకరించారు.

**కొత్త జట్లు లేవు.. నాణ్యతే ముఖ్యం: అరుణ్ ధుమాల్**

మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, కొత్త ఫ్రాంచైజీలను చేర్చే ఆలోచన లేదని అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు. "ప్రతి జట్టుకు సమానంగా హోమ్, అవే మ్యాచ్‌లు కల్పించాలంటే, మనం 74 నుంచి 94 మ్యాచ్‌ల వరకు వెళ్లవచ్చు. అయితే, జట్ల సంఖ్యను మాత్రం పదికి పరిమితం చేస్తాం" అని ఆయన వివరించారు. టోర్నీలో నాణ్యతను కాపాడటం, దేశీయ ప్రతిభావంతుల కొరత ఏర్పడకుండా చూడటానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**అసలు సవాల్ ఐసీసీ క్యాలెండరే**

ఈ ప్రణాళిక అమలుకు అతిపెద్ద అడ్డంకి ఐసీసీ ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ). 2027 వరకు ఉన్న ప్రస్తుత క్యాలెండర్‌లో 94 మ్యాచ్‌ల టోర్నీకి సరిపడా సమయం లేదు. ఈ అదనపు 20 మ్యాచ్‌ల కోసం సుమారు మూడు వారాల సమయం అదనంగా అవసరమవుతుంది. అందువల్ల తదుపరి ఐసీసీ సైకిల్‌లో ఐపీఎల్ కోసం ప్రత్యేకంగా రెండున్నర నెలల విండోను సాధించడంపై బీసీసీఐ దృష్టి సారించనుంది.

**ఆసక్తి తగ్గకుండా చూసేందుకే ఈ మార్పులు**

గత కొన్ని సీజన్లుగా టోర్నీ మధ్య భాగంలో ("మిడ్-లీగ్ ఫెటీగ్") ప్రేక్షకుల్లో ఆసక్తి కొద్దిగా తగ్గుతున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. గ్రూపుల విధానంలోని పాయింట్ల పట్టిక గందరగోళంగా ఉండటమే దీనికి కారణమని భావిస్తున్నారు. అదే 'ఫుట్‌బాల్ తరహా' సింగిల్ లీగ్ టేబుల్ అయితే, ప్రతి మ్యాచ్‌కూ ప్రాధాన్యం పెరుగుతుంది. అభిమానులు చివరి వరకు ఆసక్తిగా టోర్నీని అనుసరిస్తారు. ఈ వ్యూహాత్మక మార్పు వాణిజ్యపరంగా కూడా ప్రసారకర్తలకు, వాటాదారులకు భారీ ప్రయోజనాలు చేకూరుస్తుందని బీసీసీఐ అంచనా వేస్తోంది.

# చాహల్ వేపింగ్ ఎఫెక్ట్: అర్ష్ దీప్ సింగ్‌కు బీసీసీఐ షాక్



పంజాబ్ కింగ్స్ ఫాస్ట్ బౌలర్ అర్ష్ దీప్ సింగ్ కు బీసీసీఐ షాకిచ్చింది. యుజువేంద్ర చాహల్ వేపింగ్ ఎఫెక్ట్.. అర్ష్ దీప్ పై పడింది. ఫ్లైట్ లో చాహల్ వేపింగ్ (దమ్ము కొట్టడం) చేస్తూ వీడియోలో పట్టుబడటం ఎంత వైరల్ గా మారిందో తెలిసిన విషయమే. ఈ వ్యవహారంపై చాలా వరకు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో.. వ్లాగింగ్ ఆపేయాలంటూ అర్ష్ దీప్ కు బీసీసీఐ వార్నింగ్ ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. దీనికి కారణం అర్ష్ దీప్ వ్లాగ్ వీడియోలే. జనరల్ గా అర్ష్ దీప్ వీడియోస్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండటం అందరికీ తెలిసిందే. అయితే ఎప్పటిలాగే వ్లాగింగ్ చేస్తుండగా.. అందులో చాహల్ వేపింగ్ చేస్తున్న విజువల్స్ బయటపడ్డాయి. ఇది చూస్తుండగా దేశ వ్యాప్తంగా వైరల్ గా మారటంతో .. బీసీసీఐ ఈ ఇష్యూలోకి ఎంట్రీ ఇచ్చింది. టోర్నమెంట్ జరుగుతున్న సమయంలో వ్లాగింగ్ కు దూరం ఉండాలని అర్ష్ దీప్ కు బీసీసీఐ సూచించింది. ఈ వ్లాగింగ్ వల్లనే లేని పోని పర్సనల్ విషయాలు, సీక్రెట్ మ్యాటర్స్, కొన్నిసార్లు వివాదాస్పద అంశాలు బయటపడుతున్నాయి. ఆటగాళ్ల తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో వ్లాగింగ్ ఆపేస్తేనే బెటర్ అని చెప్పింది. 2026 ఐపీఎల్ లో వేపింగ్ వ్యవహారం ఇది మొదటిది కాదు. రాజస్తాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ కూడ వేపింగ్ చేస్తూ కనిపించాడు. చాహల్ విమానంలో చేస్తే.. పరాగ్ ఏకంగా స్టేడియంలో డ్రెస్సింగ్ రూమ్ లో దమ్ము గుంజుతూ కనిపించాడు. ఈ వ్యవహారంలో రియాన్ పరాగ్ కు 25 శాతం మ్యాచ్ లో కోత విధించారు.

# బెంగళూర్ టాప్2 ఆశలకు గండి పడ్డట్లేనా..!

## క్వాలిఫైర్ 1 గా నిలవాలంటే ఆర్సీబీ ముందున్న ఆప్షన్స్ ఏంటి..?



ఐపీఎల్-2026 లో అందరి కంటే మంచి ఆరంభంతో మొదలు పెట్టి ఈసారి కూడా కప్పు నమ్దే.. అని ఫ్యాన్స్ అనుకునేలా వీరవిహారం చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్.. కీలక దశలో ఢీలా పడుతోంది. టాప్2 ప్లేస్ లపై కన్నేసిన ఆర్సీబీ మొన్నటి వరకు అది మెయింటైన్ చేస్తూ వచ్చింది. కానీ ఆర్సీబీ ఆశలకు గండి కొడుతూ గురువారం (మే 07) లక్నో పెద్ద షాకే ఇచ్చింది. ఎలిమినేట్ అవుతుందనుకున్న లక్నో.. ఆర్సీబీకి కొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది.

ఐపీఎల్ లో మొదటి నాలుగు మ్యాచ్ లు గెలిచి బెస్ట్ ఫామ్ లో ఉన్నట్లు కనిపించిన ఆర్సీబీ.. టాప్ 2 ఆశలు గల్లంతయ్యే పరిస్థితి వచ్చేలా కనిపిస్తోంది. లక్నోతో ఓటమితో పాయింట్స్ టేబుల్ లో 3వ స్థానానికి పడిపోయింది. అదే సమయంలో పై రెండు స్థానాలను హైదరాబాద్, పంజాబ్ ఆక్యుపై చేసుకున్నాయి. లీగ్ దశలో బెంగళూర్ కు ఇంకా నాలుగు మ్యాచ్ లు మిగిలే ఉన్నాయి. ఈ 4 గేమ్స్ లో హైదరాబాద్, పంజాబ్ లను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే ఈ రెండు టీమ్స్ పైన గెలిస్తే క్వాలిఫైర్ 1 ఆశలు సజీవంగా ఉంటాయి. కానీ ఓడిపోతే మొత్తానికే మోసం వచ్చే పరిస్థితి లేకపోలేదు. టాప్ 4 స్థానం కూడా ఆర్సీబీకి కష్టతరమయ్యే పరిస్థితి ఉంటుంది. సో ఇలాంటి టైమ్ లో ఆర్సీబీ ప్లే-ఆఫ్ అవకశాలు ఎలా ఉన్నాయో చూద్దాం:

**కేస్ 1:**

ఒకవేళ ఆర్సిబి మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో (ముంబై, కోల్ కతా, పంజాబ్, హైదరాబాద్ లతో) అన్నింటిలోనూ గెలిస్తే, 20 పాయింట్లతో దాదాపుగా టాప్-2 స్థానాన్ని ఖాయం చేస్తుంది.

**కేస్ 2:**

ఒకవేళ ఆర్సిబి తమ మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో మూడింటిలో గెలిస్తే, 18 పాయింట్లు పొందుతుంది. ప్రస్తుతం ఉన్న రన్ రేట్ (०1.234)ను అలాగే కొనసాగిస్తే.. అది ప్లస్ పాయింట్ అవుతుంది. ఒకవేళ ఎస్ఆర్‌హెచ్ లేదా పిబికెఎస్ లాంటి టీమ్స్ కూడా 18 పాయింట్లే పొందితే.. రన్ రేట్ కారణంగా మిగతా జట్లకంటే పై స్థానంలో ఉంటుంది. ఇది జరగాలంటే హెడ్-టు-హెడ్ మ్యాచ్‌లలో ఎస్ఆర్‌హెచ్ లేదా పిబికెఎస్‌ను తప్పక ఓడించాలి.

**కేస్ 3:**

ఒక వేళ ఆర్సీబీ 16 పాయింట్లతో లీగ్ దశను ముగిస్తే.. టాప్-టూ స్థానం కష్టతరమవుతుంది. అది ఇతర ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ =జదీ తమ చివరి నాలుగు లీగ్ మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో గెలిస్తే, రెండవ స్థానంలో లేదా అంతకంటే మెరుగైన స్థానంలో నిలవాలంటే, ా=ఎ మిగిలిన మూడు మ్యాచ్‌లలో కనీసం రెండింటిలో ఓడిపోవాలి. లేదా ాదీఖం మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో కనీసం మూడింటిలో ఓడిపోవాలి. దీనికి తోడు రాజస్థాన్, గుజరాత్ (ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్నవి) తమ మిగిలిన మ్యాచ్‌లలో రెండింటి కంటే ఎక్కువ గెలవకూడదు. ఇంత గందరగోళం లేకుండా టాప్ 2 లో ఉండాలంటే.. =జదీ తమ రెండు మ్యాచ్‌లలో గెలవాలి. భారీ నెట్ రన్ రేట్ ( చీ==) మెయింటైన్ చేస్తే.. మరో మూడు మ్యాచ్‌లలో గెలిస్తే, 18 పాయింట్లతో ఉన్న ఏ టీమ్ నైన అధిగమించి టాప్ 2కి వెళ్లడం ఈజీ. అలా కాకుండా ఓటమి చవిచూస్తే.. పాయింట్స్ టేబుల్ లో ఎలిమినేటర్ దశలో మూడు లేదా నాలుగో స్థానంలో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. .

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776